క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చినమేరంగి ఎస్ఐ అనీష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ క్రైం నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ధూమపానం, తాగుడుకు బానిస కాకుండా ఉండాలని, వాటిపై ప్రతి ఒక్కరికీ తెలియపరచాలన్నారు. విద్యార్థులకు సైబర్ క్రైంపై యువత తీసుకోవలసిన జాగ్రత్తలపై ఎస్ఐ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త తొలగించండి



కమిషనర్ సర్వేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న కాలనీ వాసులు

పాలకొండ : పట్టణంలోని వెంకటరాయుని కోనేరు గట్టుపై పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఆంజనేయనగర్, నీలమ్మకాలనీ, టీచర్స్ కాలనీలకు చెందిన ప్రజలు కోరారు. ఈ మేరకు నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కోనేరు గట్టును చాలా మంది డంపింగ్‌యార్డుగా వినియోగిస్తున్నారని, ఈక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం..



రైతు సదస్సులో మాట్లాడుతున్న సర్వేయర్ రాజేశ్వరరావు

భామిని: భూముల రీ సర్వేలో చోటుచేసుకున్న సమస్యలపై రైతులు అర్జీలు ఇస్తే పరిష్కరిస్తామని డిప్యూటీ తహసీల్దార్ శంకరరాయుడు, మండల సర్వేయర్ రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని పెద్ద దిమిలిలో సర్పంచ్ తొగరాన శ్రీను అధ్యక్షతన శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సమావేశంలో సహాయ సర్వేయర్లు, వీఆర్‌ఓ, రైతులు పాల్గొన్నారు.

బడికి రాని విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు



ఎరుకలపేటలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడికి రాని విద్యార్థుల ఇళ్లకు శుక్రవారం వెళ్లి వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేసారు. గవరమ్మపేట పంచాయతీ ఎరుకలపేట గ్రామానికి వెళ్లి వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు చదువుకుంటే వచ్చే లాభాలను వివరించారు. తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుని వారి పిల్లలు బడికి పంపే కార్యక్రమం తీసుకోవాలన్నారు. గ్రామానికి వెళ్లే వారిలో ప్రథమ సహాయకులు రమణ, సీనియర్ ఉపాధ్యాయులు, సుబ్బారావు, వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



గరుగుబిల్లిలో పారిశుధ్య నిర్వహణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

గరుగుబిల్లి: దోమల వ్యాప్తి నివారణకు విధిగా అన్ని గ్రామాల్లో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని గరుగుబిల్లి, రావివలస, లఖనాపురం, నాగూరు, ఉల్లిబద్ర తదితర గ్రామాలలో ఫ్రైడే...డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల నివారణలో భాగంగా ఆయిల్ బాల్‌లు, ఇతర కీటక నాశని పదార్థాలు ఉపయోగించాలన్నారు. తాగునీటి సరఫరా పైపుల పరిస్థితి తనిఖీ చేయాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ తంటాలు..



పాలకొండ-శ్రీకాకుళం రహదారిలో ట్రాఫిక్ దుస్థితి (ఫైల్)

- పాలకొండలో నిత్యం ఏదో ఒక రోడ్డు ప్రమాదం
- పండగల నేపథ్యంలో మరింత రద్దీ
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించని అధికారులు
- రోడ్డు పైకి రావడానికే భయపడుతున్న ప్రజలు

పాలకొండ రూరల్: డివిజన్ కేంద్రమైన పాలకొండలో ప్రజలు, వాహన చోదకులకు ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. నియోజకవర్గ పరిధిలోని పాలకొండ, వీరఘట్టం, భామిని, సీతంపేటకు చెందిన వేలాది మంది నిత్యం వివిధ పనుల నిమిత్తం పాలకొండకు వస్తుంటారు. దీంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఈ పరిస్థితుల్లో వాహనచోదకులు, పాదచారులకు ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. పట్టణంలో ప్రత్యామ్నాయ రహదారులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రోడ్లపైకి రావాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా వీరఘట్టం, పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద చోటుచేసుకున్న వాహన ప్రమాదాల్లో పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. ముఖ్యంగా ద్విచక్రవాహనాల సంఖ్య అధికంగా ఉండడం, నియోజకవర్గంలో ఎక్కడా వన్ వే లేకపోవడం, తదితర కారణాలతో ట్రాఫిక్ సమస్యలేర్పడుతున్నాయి.

నాలుగు మండలాల్లో...

పాలకొండ పట్టణంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో ఉన్నప్పటికీ అధికారుల మధ్య సమన్వయం కొరవడడంతో అభివృద్ధి పను



ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు (ఫైల్)

లకు ఆటంకం ఏర్పడుతోంది. రహదారులు అభివృద్ధి చేయాలన్నా, ఆక్రమణలు తొలగించాలన్నా అధికారులు సమన్వయంతో ముందడుగు వేస్తే ఫలితం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీరఘట్టం జంక్షన్ మొదలుకుని ఆర్డీఓ కార్యాలయం వరకు ప్రధాన రహదారికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవు. దీంతో ఒకే రహదారిపై అన్ని స్థాయి వాహనాలు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. నాలుగు మండలాల పరిధిలో 60 అడుగుల రహదారులకు ఇరువైపులా చిరువ్యాపారాలు కొనసాగుతుండంతో.. విస్తీర్ణం తగ్గి రోడ్లు 40 అడుగుల లోపునకు కుదించుకుపోయాయి. ఇదిలా ఉంటే రహదరుల విస్తరణ చేపడతామన్న ఆర్‌అండ్‌బీ అధికారులు గడిచిన కొద్ది రోజులుగా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. వరుస పండుగల నేపథ్యంలో వాహనాలతో రోడ్డుమీదకు రావాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పార్కింగ్ ప్రదేశాలు ఎక్కడా అందుబాటులో లేకపోవడం ఇబ్బందిగా మారింది.

ఆక్రమణలతో ఇక్కట్లు

పాలకొండ - వీరఘట్టం, విశాఖ, శ్రీకాకుళం ప్రధాన రహదారులకు ఇరువైపులా ఆక్రమణలు చోటుచేసుకోవడంతో ఆయా రోడ్లు ఇరుకుగా మారాయి. భారీ వాహనాలు వచ్చేటప్పుడు గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కళాశాలలకు వచ్చి, వెళ్లే విద్యార్థులతో రహదారులు కిటకిటలాడుతున్నాయి. వీరు తమ గమ్యస్థానాలు చేరే క్రమంలో బస్సుల ఫుట్‌బోర్డ్‌పై ప్రయాణం చేస్తూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నా అనుకున్న ఫలితాలు ఇవ్వడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలి



డివిజన్ కేంద్రంలో రోజురోజుకూ రద్దీ పెరుగుతోంది. పండుగ సీజన్‌లో ప్రజలు, వాహనచోదకులు ట్రాఫిక్‌ను చూసి బెంబేలెత్తిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. పట్టణంలో ప్రత్యామ్నాయ రహదారుల ఏర్పాటుపై యంత్రాంగం దృష్టి సారించాలి. బైపాస్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయి.

– ఎచ్చెర్ల జయరామ్, పాలకొండ పట్టణం

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..



ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా అవసరానికి అనుగుణంగా బ్లాకోట్, సీపీఓ వ్యవస్థలను అమలు చేస్తున్నాం. రక్షక్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చాం. సమస్యలు అధిగమించే క్రమంలో సబ్‌డివిజన్ పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎక్కువ మంది సిబ్బందిని కేటాయిస్తాం.

– ఎం.రాంబాబు, డీఎస్పీ, పాలకొండ

ఖైదీల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ

- లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సన్యాసినాయుడు



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా లీగల్‌సెల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సన్యాసినాయుడు

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీల ఆరోగ్య భద్రతపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జిల్లా లీగల్‌సెల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. డివిజన్ కేంద్రంలోని సబ్‌జైల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ, వారికి అందుతున్న న్యాయపరమైన, సాధారణ సేవలపై ఆరా తీశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. అలాగే వంటశాల, పారిశుధ్య నిర్వహణ తీరును మెరుగుపరుచుకోవాలని జైల్ సూపరింటిండెంట్ బి.జోగులకు సూచించారు. ప్రస్తుత సీజన్‌లో దోమలు, వైరల్ జ్వరాలు విజృంభించకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఖైదీలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఆయన వెంట స్థానిక లీగల్ సెల్ కమిటీ ఇన్‌చార్జ్ చైర్మన్, న్యాయమూర్తి పీఎస్‌వీబీ కృష్ణసాయి తేజ, న్యాయవాదులు జి.సత్యంనాయుడు, ఎంవీ వెంకటేశ్వరరావు, శామ్యూల్, హెడ్ వార్డర్స్ పి.చంద్రరావు, విజయ్‌కుమార్, హేమసుందర్, ఏఎస్సై శ్రీనివాసరావు, తదితరులున్నారు.

పాఠశాల సందర్శన



విద్యార్థుల నుంచి జవాబులు రాబడుతున్న ఎంఈఓ

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాల(ఆర్)ను మండల విద్యాధికారి-1 జి.గౌరునాయుడు శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. పాఠ్యాంశాలు ఎంతవరకు అవగాహన చేసుకున్నారు.. తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల రిజిష్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. తెలుగు, ఆంగ్లం, గణితంపై మంచి తర్ఫీదు ఇవ్వాలని సంబంధిత ఉపాధ్యాయులకు సూచించారు.

డిగ్రీ కళాశాలలో మాక్ పార్లమెంట్



మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు స్వరూప, సింహాచలం, కుమారి, శ్రీవాణి, కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులచే మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈమేరకు స్పీకర్‌గా థర్డ్ ఎంపీసీఎస్ విద్యార్థి శివానంద్ వ్యవహరిస్తూ శీతాకాల సమావేశం ప్రారంభించారు. ప్రధానమంత్రి పాత్రధారి సెకండ్ సీబీజెడ్ విద్యార్థి పద్మిని సభాపతిని నమస్కరిస్తూ ఉపన్యాసంతో ప్రారంభించారు. అధికార యంత్రాంగంగా పలువురు విద్యార్థులు, ప్రతిపక్ష అధ్యక్షుని హోదాలో సీబీజెడ్ విద్యార్థి తరుణ్ తదితరులు వ్యవహరించి, ఒకరికొకరు ప్రశ్నలు, సమాధానాలు రాబెడుతూ, సంతృప్తి చెందని ప్రతిపక్షం వాకౌట్ చేసి సభ నుంచి బయటికి వచ్చేయడంతో, సమావేశాన్ని కాసేపు కొనసాగించి సమాప్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం మాట్లాడుతూ మాక్ పార్లమెంట్ ఉత్కంఠంగా సాగిందని విద్యార్థులను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సలకు కంటి రోగుల తరలింపు



నేత్ర శస్త్ర చికిత్సల కోసం కురుపాం సీహెచ్‌సీ నుంచి వృద్ధుల తరలింపు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోని గ్రామ సచివాలయాల పరిధిలో గతంలో నిర్వహించిన నేత్ర వైద్య పరీక్షల్లో కేటరాక్ట్(అంతర కుసుమం), టెరిజియం(కొయ్యకండ) ఉన్నట్లు నిర్ధారించి నేత్ర శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేసిన 28 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం కురుపాం సీహెచ్‌సీ నుంచి శుక్రవారం విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి మాట్లాడుతూ శస్త్ర చికిత్సలకు తరలిస్తున్న వారికి ఉచిత భోజన, వసతి, రవాణా సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం కూడా ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందించి స్వగ్రామాలకు చేరవేస్తామన్నారు. ఆపరేషన్లు చేయించుకున్న వారికి వారంతపు పరీక్షలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. ఆయన వెంట ఆరోగ్యమిత్రాలు రజని, సురేష్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న జగన్‌మోహన్‌రావు

గరుగుబిల్లి: రోగులకు మెరుగైన సేవలను అందించాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్‌మోహన్‌రావు సిబ్బందికి సూచించారు. మండలంలోని రావివలస పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీసి, సీజనల్ వ్యాధులు ఏమేరకు నమోదు అవుతున్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాముకాటు, కుక్కకాటుకు గురై ఎవరైనా వస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీలో మందుల వివరాలు, వాక్సిన్ నిల్వలు, లేబర్ రూంను, రికార్డులను ఆయన నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలలో నీటి స్వచ్ఛత పరీక్షలు ప్రతీ వారం విధిగా నిర్వహించాలన్నారు. హైరిస్క్ గర్భిణులు నవజాత శిశువుల గృహ సందర్శన చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువులు, కిశోర బాలికల్లో హిమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.కె.కార్తీక్, డీఎస్ఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పశుగణన ప్రారంభం



జియ్యమ్మవలస: అల్లువాడ సచివాలయం వద్ద పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్



గరుగుబిల్లి: మరుపెంటలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రామారావు తదితరులు



పాలకొండ: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

గరుగుబిల్లి: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎంపీపీ ఉరిటి రామారావు మండలంలోని మరుపెంట గ్రామంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంపద మరింత అభివృద్ధి చెందేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. ఇంటింటికి వెళ్లి పశువులు వివరాలు, కోళ్లు, గొర్రెలు మేకలు తదితర వివరాలను సేకరించడం జరుగుతుందని వైద్యాధికారి ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. సర్వేను ఫిబ్రవరి 28లోగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలసలో..

జియ్యమ్మవలస: మండలంలోని పశువైద్యాధికారి మునికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పశుగణనను ఎంపీపీ బొంగు సురేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. 2025 ఫిబ్రవరి చివరి వరకు పశుగణన సర్వే నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి తెలిపారు. సర్పంచ్ బొంగు పరిశినాయుడు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశు గణనతో రైతన్నకు మేలు

భామిని: పశు గణనతో రైతన్నకు మేలు జరగనుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు తోట సింహాచలం, యువజన నాయకుడు తోట లాల్ అన్నారు. మండలంలోని కాట్రగడ – బి సచివాలయం వద్ద 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని పశువైద్యాధికారి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో సచివాలయ వీఏలు రమేష్, హరిప్రియ, రైతులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

పాలకొండ: అఖిల భారత పశుగణన పోస్టర్లను శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పశు వైద్యశాల సహాయ సంచాలకుడు ప్రభా మాణిక్యరావు, తహసీల్దార్ బాలమురళి, ఎంపీడీఓ విజయరంగారావు మాట్లాడుతూ, పశుగణన ఆవశ్యకతను వివరించారు. శనివారం నుంచి పశుగణన చేపడతామని, ఇందుకోసం 20 మంది ఎన్యుమరేటర్స్‌ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి బి. సిద్ధార్థ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

భామిని: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోట శాంతికుమారి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుండేల చంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ హాజరుకావాలని కోరారు.

దళితులపై దాడి సరికాదు



సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలియజేస్తున్న పలు ప్రజా, దళిత సంఘాల నాయకులు

పాలకొండ రూరల్: జియమ్మవలసలో దళితులపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని వ్యవసాయ, కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు దళిత, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దళితులపై దాడిచేసి తిరిగి వారిపైనే కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణరావు, గిరిజన సంఘ నాయకులు కోరంగి సీతారాం, దూసి దుర్గారావు, బి.మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

దానా హెచ్చరికలతో రైతుల్లో గుబులు

గరుగుబిల్లి: దానా తుఫాన్ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో కొద్ది రోజుల్లోనే వరి చేను కోతలు కోయనున్నారు. ఇప్పటికే చేను ఈని బరువుగా ఉందని, తుఫాన్ ప్రభావం పడితే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక దీలా పడుతున్నారు. తుఫాన్ ప్రభావం ఎలా ఉంటుందో తెలియక తమ పంట చేలను చూస్తూ కలవరపడుతున్నాడు. కోతలు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో తుఫాన్ హెచ్చరికలతో రైతులు కోతలు నిలిపివేశారు.

హక్కులపై దాడి చేస్తోంది..

గుమ్మలక్ష్మీపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులపై దాడి చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆరోపించారు. మండలంలోని మూలజమ్ము గ్రామంలో సీపీఎం మహా సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలన అంతా కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసేలా ఉందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను పెంచి ప్రజలపై భారం మోపుతోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, రైల్వేలు, విశాఖ స్టీల్ ప్లాంట్‌లను ప్రైవేట్ పరం చేసేందుకు యత్నిస్తోందన్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకూ ప్రజలు పోరాడాలన్నారు. బీజేపీ మత రాజకీయాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందన్నారు. ఆ పార్టీ నాయకులు కోలక అవినాష్ మాట్లాడుతూ స్థానిక సమస్యలు పరిష్కారం కోరుతూ నవంబర్ 8 నుంచి 15వ తేదీ వరకు ప్రజా హోరు పేరుతో ఇంటింటా ప్రచారం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎం.సన్యాసిరావు, రమేష్, గంగాధర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కంచెను తొలగించాలి



కంచెను తొలగించాలని ఆర్టీసీ డీఎంను కోరుతున్న స్థానిక వ్యాపారులు, సర్పంచ్

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న మద్యం దుకాణానికి ఎదురుగా ఆర్టీసీ అధికారులు వేసిన కంచెను తొలగించాలని స్థానిక వ్యాపారులు స్థానిక సర్పంచ్ బి.గౌరీ శంకరరావు ఆధ్వర్యంలో పార్వతీపురం ఆర్టీసీ డిపో డీఎం దుర్గను కోరారు. కంచె ఏర్పాటు పనులను పరిశీలించేందుకు శుక్రవారం వచ్చిన ఆమెను ఈ మేరకు కోరారు. ఈ సందర్భంగా వారు డీఎంతో మాట్లాడుతూ మద్యం దుకాణం ఆర్టీసీ స్థలంలో ఏర్పాటు చేయలేదని, మద్యం షాపునకు ఎదురుగా కంచె ఏర్పాటు చేయించడం సబబు కాదని, తొలగించాలని కోరారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల కోసం కనీస సౌకర్యాలు లేవని, ఆర్టీసీ రహదారి అధ్వానంగా ఉందని, ఆర్టీసీ స్థలాల్లో నిర్మించిన దుకాణాల నుంచి ప్రతి నెలా రూ.వేలల్లో అద్దెలు వసూలు చేస్తున్నా సౌకర్యాలు కల్పించడం లేదని, ప్రయాణికుల కోసం సౌకర్యాలు కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన డీఎం మాట్లాడుతూ మద్యం మత్తులో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకూడదనే ఉద్దేశంతోనే ముందస్తు చర్యల్లో భాగంగానే ఆమ ఆవరణలో కంచెను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

కషాయాలతో చీడపీడల నివారణ



కషాయం తయారీ విధానంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సౌజన్య

వీరఘట్టం: పంటలకు ఆశించే చీడపీడల నివారణకు కషాయాలు ఉపయోగపడతాయిన మండల వ్యవసాయ శాఖాధికారి ఎ. సౌజన్య అన్నారు. మండలంలోని అచ్చెపువలసలో కషాయాల తయారీపై శుక్రవారం అవగాహన కల్పిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూరగాయాలు, అరటి, వరి, పూల మొక్కలకు రసం పీల్చు పురుగులు ఆశిస్తున్నాయని, వాటి నివారణకు దశపర్ని కషాయం ఉపయోగపడుతుందని చెప్పారు.

● ఆరుబయటే తరగతులు..



సీతంపేట మండలంలోని ద్వారబందం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. ఈ షెడ్డు కూడా అధ్వానంగా ఉండడంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎప్పుడు కూలిపోతుందోనని భయంతో ఆరుబయటే తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పాఠశాలలో ఎగువ, దిగువ, నడిమి ద్వారబందం గ్రామస్తుల పిల్లలు చదువుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు పక్కా భవనం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - సీతంపేట